

కమనీయం రంగనాథుడి కల్యాణం

పులివెందుల సమీపంలో శ్రీరంగనాథస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. -8లో..



శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హెచ్చరించారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.4/26.5

జిల్లాలో బుధవారం 26.5 – 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

బైజూస్.. ట్యాబ్‌లు వచ్చేశాయ్

- 8వతరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు
- వైఎస్సార్ జిల్లాలో 16,382 బైజూస్ ట్యాబ్‌లు సిద్ధం
- వరుసగా రెండవ ఏడాది పంపిణీకి అధికారుల చర్యలు





ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చి దిద్దుతోంది. ఇందుకోసం బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఎనిమిదో తరగతి చదువుతున్న 15,697 మందికి ఇవ్వనున్నారు. ఈ ఏడాది కొత్తగా పదోన్నతులు పొందిన 685 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. దీంతోపాటు బైజూస్ ట్యాబ్‌ల కొనసాగింపుగా పాఠశాలల్లో ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీల్లోనూ బైజూస్ కంటెంట్ చూపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి, విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించే క్రమంలో ఏదైనా జరిగి స్క్రీన్ డ్యామేజీకి ప్రభుత్వమే రిపేరి చేయించాలని నిర్ణయించింది.

పర్యవేక్షణ విద్యాశాఖదే..

విద్యార్థులకు ప్రభుత్వం అందచేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. అలాగే సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలను సందర్శించి వాటి పని తీరును పరిశీలించాలి. ప్రతి శుక్రవారం పాఠశాలను సందర్శించే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్టు చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

సాంకేతిక సమస్యల పరిష్కారానికి..

ట్యాబ్‌లు వినియోగించే క్రమంలో ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు సత్వర పరిష్కారం కోసం పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పాటు చేసిన పటిష్టమైన నిర్వహణా విభాగాలివీ..

పాఠశాల స్థాయి: హెచ్ఎం, అడాప్టెడ్ టీచర్, యాక్టివ్ టీచర్
గ్రామ స్థాయి: డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్
మండలస్థాయి: మండల స్థాయి యాక్టివ్ టీచర్స్, ఎమ్మార్సీ సిబ్బంది
జిల్లాస్థాయి: జిల్లా నోడల్ పర్సన్
రాష్ట్రస్థాయి: రాష్ట్ర నోడల్ పర్సన్, ట్యాక్టోరో టీమ్,

సమస్యలు	పరిష్కరించేవారు
ఎస్‌డి కార్డు	డీఎస్‌ఓ
క్యూఆర్ కోడ్	డీఎస్‌ఓ
బైజూస్	డీఎస్‌ఓ, బైజ్యూస్ టీమ్
సాఫ్ట్‌వేర్	డీఎస్‌ఓ, టెక్టోరో టీమ్
డ్యామేజ్	డీఏ, వెల్ఫేర్ ద్వారా సర్వీస్ సెంటర్ పంపి పరిష్కరిస్తారు
ట్యాబ్ మిస్సింగ్	పోలీసులకు తెలిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయించి నూతన ట్యాబ్ తెప్పించడం

బైజ్యూస్ టీం, శ్యామ్‌సంఘ్ టీమ్

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో...

విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లలో యుట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా ప్రభుత్వం టెక్టోరో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ సాయంతో ప్రత్యేక చర్యలు చేపట్టింది. మూడు యాప్‌ల(వైఫై, బైజూస్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్‌డేట్ చేస్తున్నారు. అప్‌డేట్ చేసే క్రమంలో ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

జిల్లాలో విద్యా శాఖ డివిజన్ ప్రకారం 8వ తరగతి విద్యార్థుల వివరాలు..

డివిజన్	బాలురు	బాలికలు	మొత్తం
కడప	3815	4301	8116
పొద్దుటూరు	3440	4141	7581
మొత్తం	7255	8442	15697



8వ తరగతి విద్యార్థులందరికీ ఇస్తాం



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం విద్యార్థుల వివరాలు, ఉపాధ్యాయుల వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అందరికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తాం. –లక్ష్మీనారాయణ, బైజూస్ నోడల్ అధికారి

ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా...



ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా విద్యార్థులకు ఉపయోగ పడేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ను అందజేస్తోంది. విద్యార్థులు సక్రమంగా వినియోగించుకున్నప్పుడే వాటి ఫలితాలు అందుకోవడానికి మార్గం సుగమమౌతుంది. ప్రతి విద్యార్థి గణితం, సైన్సు, సోసియల్ విషయాలను చూసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలి. – ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

న్యూస్‌రీల్

సెలవు రోజునా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఈ నెల 28వ తేదీన సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. చక్రాయపేటలో అత్యధికంగా 30.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, అట్లూరులో 25.2, వీఎన్‌పల్లెలో 24, ఎర్రగుంట్లలో 22.4, కమలాపురంలో 20.4, పెండ్లిమర్రిలో 14.4, దువ్వూరు, వల్లూరులో 7.4, చెన్నూరులో 5.6, సికెదిన్నె, వేంపల్లిలో 5.2, సిద్దవటంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

గండికోటకు వరదనీరు



చిత్రావతిలో వరద నీటి ప్రవాహం

కొండాపురం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించడంతో గండికోట జలాశయంలోకి 4400 క్యూసెక్కుల నీరు చేరుతోందని గాలేరు–నగరి సృజల స్రవంతి డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా, 18.9 టీఎంసీలు నిల్వ ఉందన్నారు.

స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికలు

కడప స్పోర్ట్స్: పులివెందుల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, టెన్నిస్, వాలీబాల్‌లో 30 మంది బాలురతో అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీలోపు డీఎస్ఏ క్రీడా మైదానంలో అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు అక్టోబర్ 10 నుంచి 13వ తేదీ వరకు పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు వస్తారన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య రఘుబాబు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాల అభివృద్ధి మండలి(సీడీసీ) డీన్‌గా ఆచార్య కె.రఘుబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైవీయూ సీడీసీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ మార్గదర్శనంలో కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

కడప కల్చరల్: కడప రాయుడు లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవరోజున ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్ పూజలు నిర్వహించారు. వేద పండితులు పవిత్రాల ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రేపు డయల్ యువర్ డీపీటీఓ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈనెల 29వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ డిస్ట్రిక్ట్ పీపుల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

డబ్ల్యూఎన్ఎస్‌తో ఎంఓయూ

వైవీయూ: పోటీ ప్రపంచంలో ఇన్నొవేటివ్ ప్రోగ్రామ్స్, కాంపిటీటివ్ జాబ్ మార్కెటింగ్‌కు తగిన విధంగా విద్యార్థుల్లో నైపుణ్యత పెంచేలా ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చేందుకు ముంబయికి చెందిన డబ్లుఎన్ఎస్ గ్లోబల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారులు బుధవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలకు ఆ సంస్థ ప్రతినిధులు పత్రాలను అందజేశారు. వీసీ మాట్లాడుతూ సంస్థ కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాం, ఫైనాన్షియల్ అకౌంటింగ్ ప్రోగ్రాం, వైబ్రేట్ ఫెలోషిప్ ప్రోగ్రాం ఫర్ లీడర్స్ ఆఫ్ టుమారోపై శిక్షణ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు, డా. సుభోష్ చంద్ర, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పులివెందుల బస్టాండు భళా



మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్టీసి డిపో మేనేజర్ రామకృష్ణ

పులివెందుల రూరల్: యాన్యువల్ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు –2023లో భాగంగా బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ బస్టాండ్ అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పులివెందుల వైఎస్సార్ బస్ టెర్మినల్‌ను ఎంపిక చేసింది. విజయవాడలోని కళాక్షేత్రంలో పర్యాటక శాఖా మంత్రి రోజా చేతుల మీదుగా ఈ అవార్డును పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ, డిప్యూటీ ఆఆ పోతురాజులు అందుకున్నారు. ఈ బస్ టెర్మినల్‌ను గత డిసెంబర్‌లో ప్రారంభించారు. ప్రయణికులకు విశ్రాంతి గదులు, క్యాంటీన్, పర్యాటక ప్రాంతాల గురించి తెలిపే ప్రత్యేక బోర్డులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో ఈ అవార్డు దక్కినట్లు డీఎం తెలిపారు.

సాక్షి విలేఖరికి అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డు అందజేస్తున్న మంత్రి రోజా

కడప సెవెన్‌రోడ్స్: కడపలో సాక్షి కల్చరల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న పంతుల పవన్ కుమార్‌కు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డు–2023ను బుధవారం అందజేసింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక కథనాలు రాసినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది.

పర్యాటక దినోత్సవం

సిద్దవటం: సిద్దవటంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మట్లిరాజుల కోట ముఖద్వారం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): ప్రజలు ఏవైనా సమస్యలతో అధికారుల వద్దకు వస్తే.. వాటిని పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. మైలవరం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ''జగనన్నకు చెబుదాం'' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడూతూ సమస్యలుటే ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా అయా మండల అధికారుల వద్ద సోమవారం జరిగే స్పందనలో తెలుపాలన్నారు. సమస్యలను పెండింగ్‌లో పెట్టవద్దని, రోడ్లు, ప్రభుత్వ భవనాలు, కాల్వలను వెంటనే పూర్తిచేయాలని ఆయన సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు 37 రెవెన్యూ, 35 పంచాయతీరాజ్, 8 ఆర్‌అండ్‌డీ వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఆర్డీఓ జి.శ్రీనివాసులు తహశీల్దారు తిరుపతయ్య, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ విద్యార్థులకు పురస్కారాలు



తేజస్విని




కృష్ణారెడ్డి

ఏఎఫ్‌యూ: నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు దక్కాయి. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విశ్వ విద్యాలయం ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థులు వి.తేజశ్విని(గండికోట చిత్రం), సి.హెచ్‌కె.వి.కృష్ణారెడ్డి(దేవరగట్టు కర్రల సమరం)లకు బుధవారం ఫొటోగ్రఫీ ఆఫ్ ఇండియా అధికారులు అవార్డులు అందజేశారు. వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి వారిని అభినందించారు.

వినిపించు భారత వీరగాథ

- విద్యార్థులకు నాలుగు విభాగాలుగా వీరగాథ–3 పోటీలు
- ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి నింపడంతో పాటు వారిలోని సృజనాత్మకతకు పదును పెట్టేందుకు విద్యా మంత్రిత్వ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్‌లో వీరగాథ–3 పోటీలు నిర్వహిస్తున్నాయి. మూడు నుంచి 12వ తరగతి విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్ర లేఖనం, వ్యాసరచన, మల్టీ మీడియా ప్రదర్శన తదితర పోటీలు ఉన్నాయి. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించేలా పోటీలు ఉంటాయి. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తుండగా ఈ నెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది.

పోటీ అంశాలు ఇవే...!

వీరగాథ 3.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకోవచ్చు. దేశం కోసం త్యాగం చేసిన వారిని ఆదర్శంగా ఎంచుకుని వారు అందుకున్న అవార్డులు, వారి నుంచి నేర్చుకున్న అంశాలు ప్రస్తావించాలి. అవకాశం వస్తే అతడి జ్ఞాపకశక్తిని సజీవంగా ఉంచేందుకు అవకాశం ఇస్తే ఆయన ఏం చేయదలుకున్నారో చెప్పాలి. ఝాన్సీలక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించవచ్చు. సిపాయిల తిరుగుబాటును ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుడి జీవిత కథ తనను ఏ విధంగా ప్రభావితం చేసిందో చెప్పాలి.

నాలుగు విభాగాలుగా పోటీలు

- ఈ పోటీలు పాఠశాలల వారీగా నాలుగు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 3–5, 6–8, 9–10, 11–12 తరగతులవారిని వేర్వేరు కేటగిరీలుగా విభజించారు.
- 3–5 తరగతుల విద్యార్థులకు పద్యం, వ్యాసం (150 పదాలు), పెయింటింగ్, చిత్రలేఖనం
- 6–8 తరగతి విద్యార్థులకు పద్యాలు, వ్యాసం, పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన
- 9,10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం , పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన
- 11,12 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం ,పెయింటింగ్, చిత్రలేఖనం, మల్టీ మీడియా ప్రదర్శన

నమోదు చేసుకోవడం ఇలా...

ఆసక్తిగల విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు లేదా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.https://innovateindia. mygov.in/veer-gatha-3/ వెబ్ లింక్‌లో నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశా లల నుంచి నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి.

దేశభక్తి పెంపొందించేందుకే...

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా వీరగాథ 3.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వీరుల గాథను తెలియచేయడం, దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్‌మోడల్‌గా వివరించడం జరుగుతుంది. వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు మార్గదర్శకం చేయాలి.
–అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష జిల్లా అధికారి

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి....

వీరగాథ 3.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసకోవాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు దేశభక్తితోపాటు దేశ నాయకుల గురించి తెలుసుకుంటారు.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

30న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఐటీఐ ప్రభుత్వ కళాశాలలో చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . సంక్షేమ హస్టల్ విద్యార్థులకు ప్రతి నెల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు మనోజ్, నాయకులు చైతన్య, చరణ్, ప్రశాంత్, రెడ్డేయ్య, శ్రీను, సుదీప్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

లింగాల : లింగాల మండలం మురారిచింతల గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.గ్రామస్తులు సమాచారం అందించడంతో అధికారులు గ్రామానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు, వారి బంధువులను లింగాల తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. తహసీల్దార్ లక్ష్మినారాయణ, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంటర్మీడియట్ చదువుతున్న 16 సంవత్సరాల బాలికకు వివాహం చేయడం నేరమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండే వరకు పెళ్లి చేయరాదని తల్లిదండ్రులతో అంగీకారపత్రాన్ని రాయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, డిప్యూటి తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగాల : లింగాల మండలం వెల్లాల గ్రామానికి చెందిన వంగనూరు రోశన్న (60) బుధవారం సాయంత్రం తన ఇంటిలో విషద్రావణం తాగాడు. వెంటనే 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కడుపునొప్పి తాళలేక విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

యువతిపై దౌర్జన్యం

– కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గాజుల వీధికి చెందిన సుబ్బరాయుడు కుమార్తె ఈనెల 23వ తేదీన ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి చంపుతానని బెదిరించిన సతీష్ అనే యువకుడిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయరాముడు తెలియజేశారు. సుబ్బరాయుడుకు దూరపు బంధువైన సతీష్ లక్కిరెడ్డిపల్లె నివాసి. కడపలో ఇంజినీరింగ్ చదువుకున్నాడు. సుబ్బరాయుడి కుమార్తెను, సతీష్‌కు ఇచ్చి వివాహం చేస్తామని పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. సతీష్ ప్రవర్తన నచ్చక యువతి వివాహానికి ఒప్పుకోలేదు. ఈక్రమంలో సతీష్ తనను పెళ్లి చేసుకోవాలని దౌర్జన్యం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం..రంగనాథుడి కల్యాణం



పులివెందుల: స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

పులివెందుల టౌన్ : శ్రీరంగనాథస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. పట్టణ సమీపంలోని ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో సాయిభరద్వాజ్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సతీసమేతుడైన శ్రీరంగనాథుని ముగ్ధమోహన రూపాన్ని చూసి భక్తులు తరించారు.పురోహితులు మంగళసూత్రాలను భక్తులకు చూపించి స్వామివారి చేతికి తాకించి అమ్మవార్ల మెడలో వేశారు. చల్లా వంశీయులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఆలయ ఈఓ జీవీ రమణ, శ్రీరంగనాథ స్వామి, అంకాలమ్మ ఆలయాల చైర్మన్లు సుధీకర్ రెడ్డి, బ్యాటరీ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై శ్రీరంగనాథుడు :

నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కొలువుతీరిన స్వామివారిని భక్తులు దర్శించి తరించారు. భక్తులు కాయ, కర్పూరాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం



తహసీల్దార్ కార్యాలయానికి గేట్లు వేసి నిరసన తెలుపుతున్న రైతు చంద్రనారాయణరెడ్డి

లింగాల : లింగాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రధాన గేటుకు బుధవారం గ్రామానికి చెందిన తేరా చంద్రనారాయణరెడ్డి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా చంద్రనారాయణరెడ్డికి శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి అనే రైతుల మధ్య రహదారి విషయమై తరచూ వాదోపవాదాలు జరిగేవి. పొలంలోకి వెళ్లడానికి తనకు దారి చూపాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగానని, అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై డిప్యూటి తహసీల్దార్ త్రిభువన్ రెడ్డిని వివరణ కోరగా లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి గోవిందరెడ్డి చనిపోవడంతో ఆయన కుమారుడు శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డిలు తమ తండ్రి పేరు మీద ఉన్న భూమిని వారి పేర్లపై బదలాయించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే అక్కడ ఉన్న భూ విస్తీర్ణంలోనూ, ఆన్‌లైన్‌లో నిక్షిప్తమైన భూమి విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, తేరా చంద్రనారాయణ రెడ్డి పట్టాదారు పాసుపుస్తకంలో సుమారు 0.90సెంట్లు ఎక్కువ చూపిస్తోందన్నారు. అందువల్ల ఎక్కువ ఉన్న భూమిని తగ్గిస్తే కాని శివశంకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి పేర్లపై బదలాయించడం జరగదని చెప్పారు. ఈ విషయమై తేరా చంద్రనారాయణరెడ్డి పొలంలోకి వెళ్లేందుకు దారి కావాలంటూ అర్జీలు సమర్పించారు. అయితే విలేజ్ మ్యాప్‌లో అయనకు రహదారి ఉన్నట్లు చూపించలేదన్నారు. కనీసం సర్వే నిర్వహించేందుకు చలానాలు కట్టమని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధిక విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లో తగ్గించుకోవాలని తేరా చంద్రనారాయణరెడ్డికి తహసీల్దార్ తెలిపినా ఆయన కార్యాలయానికి రావడం లేదన్నారు. ఇరు కుటుంబాల మధ్య దారి విషయమై జరిగిన వ్యక్తిగత గొడవలు, పట్టాభూమి సమస్యలను సివిల్ న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపారని ఆయన అన్నారు. ఇలాంటి కారణాల వల్ల చంద్రనారాయణరెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేయడం జరిగిందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. అదేవిధంగా రైతు చంద్రనారాయణరెడ్డి సర్వే చలానా చెల్లిస్తానని, తన భూమి సరిహద్దులు చూపించాలని కోరడంతో త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ఆయన అన్నారు.

జీపీఎస్ బిల్లు ఆమోదం సరికాదు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జీపీఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం సరికాదని, ఇది ఉద్యోగులకు చీకటి రోజు అని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, పాలం మహేష్‌బాబు అన్నారు. బుధవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో వారు మాట్లాడారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, నరసింహారావు, ట్రెజరర్ నరసింహారావు నాయకుడు శివరాంలు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో చీకటి రోజు

కడప ఎడ్యుకేషన్ : సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలను అంధకారంలోకి నెడుతూ జీపీఎస్‌ను శాసనసభలో ఆమోదించిన ఈ రోజు రాష్ట్ర చరిత్రలో చీకటిరోజుగా మిగిలిపోతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని వీవీఆర్ ఎస్టీయూభవన్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెబుతుంటే దానిని కూడా పెడచెవిన పెట్టి నియంతృత్వ ధోరణితో జీపీఎస్‌ను శాసనసభలో ఆమోదించడం సరికాదన్నారు.

రోడ్డుప్రమాదంలో ఆరుగురికి గాయాలు



గాయపడిన ప్రసన్న, బోగాదమ్మ



ఆటో డ్రైవర్ చిన్న

వేంపల్లె : పట్టణ పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆటోను హిందుస్థాన్ పెట్రోలియం ట్యాంకర్ బుధవారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తాటిమాకులపల్లె, కదిరేపల్లె గ్రామాలకు చెందిన 10 మంది సొంత పనులు నిమిత్తం వేంపల్లెకు వచ్చారు. తిరిగి స్వగ్రామాలకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఆటోలోని ప్రసన్న, బోగాదమ్మ, బాలగంగన్న, ఆటో డ్రైవర్ చిన్న, లక్ష్మమ్మ, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 ద్వారా వారిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. . ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్ సిస్టమ్‌తో విద్యుత్ ఖర్చు ఆదా



సోలార్ పవర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి

కడప కార్పొరేషన్ : రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఖర్చులను ఆదా చేయొచ్చని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి అన్నారు. బుధవారం స్థానిక కొప్పర్తిలో ట్రయోవిజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇన్‌స్టాల్ చేసిన 120 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మానస ఇన్‌లో ఆర్బ్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఫ్యాక్టరీల విద్యుత్ అవసరాలు తీర్చడానికి సౌర శక్తిని ఉపయోగించడం ద్వారా 1.5లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఆర్బ్ ఎనర్జీ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ ట్రయో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ వారు 120 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌ను డిజైన్, సరఫరా, ఇన్‌స్టాల్ చేయడానికి ఆర్బ్ ఎనర్జీని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ట్రయోవిజన్ ప్రతినిధి నందన్‌రెడ్డి, కొప్పర్తి ఐలా చైర్మన్ శేషారెడ్డి, డిక్కీ కో ఆర్డినేటర్ ఓబిలి శంకర్, సిక్కీ కో ఆర్డినేటర్ సి. బాబు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన రాజయల్లయ్య (38) తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటనలో గాయపడిన వ్యక్తి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడప తాలూకా సీఐ పి. రాజా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

సెంట్రల్ జోన్ జట్టు విజయం



హర్షవర్ధన్ (112 పరుగులు)



రోహిత్ (91 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఏసీఏ అండర్–23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సెంట్రల్‌జోన్ జట్టు విజయం సాధించింది. వర్షం కారణంగా వాయిదా పడిన మ్యాచ్‌ను బుధవారం నిర్వహించగా, మ్యాచ్‌లో నార్త్‌జోన్, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ 91 పరుగులు, కార్తికేయ 74 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్ వంశీనారాయణ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 263 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని హర్షవర్ధన్ 112 పరుగులు, రాహుల్ 77 పరుగులు చేశారు. దీంతో సెంట్రల్‌జోన్ జట్టు 101 పరుగుల తేడాతో విజయం సాధించింది.

ట్రూఅప్ చార్జీలను ఎత్తివేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాలు వేస్తోందని వామపక్ష పార్టీలు బుధవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, రెవెల్యూషనరి సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, డబ్ల్యూ రాము, రమణయ్య, సుబ్బరాయుడు, జయవర్ధన్‌లు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలను వెంటనే ఎత్తివేయాలని కోరారు. సెల్‌ఫోన్లకు రీఛార్జిలాగా విద్యుత్ బిల్లులకు రీఛార్జి పద్ధతి తీసుకు రావడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆలోచన ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 2022లో బీజేపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లు చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. ఫిక్స్‌డ్ ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్‌రావు, వెంకట శివ, కేసీ బాదుల్లా, హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకుడు దేవర కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు సత్తార్, సీపీఎం రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అడ్వెంచర్ టూరిజం’ విశిష్టమైనది



పర్వతారోహకులతో వైవీయూ అధికారులు

వైవీయూ : పర్యాటక రంగంలో ‘అడ్వెంచర్ టూరిజం’ విశిష్టమైనదని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ‘పర్వతారోహకుల పరిచయ’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని ప్రఖ్యాత పర్వతాలను అధిరోహించిన జి. సురేష్‌బాబు, వి. శ్రీలత, రేపల్లె సుందరరాజు, గానుగపెంట హరిప్రసాద్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పర్యాటకం అనేది మనిషి మానసిక ఆనందం కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచారం చేయడమేనని, అందులో భాగంగా ప్రాణాలకు తెగించి సాహసోపేతంగా చేసే పర్వతారోహణమనేది ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. పర్వతారోహకుడు సురేష్‌బాబు మైనస్ 20 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకునేలా కఠినశిక్షణ పొంది తన 18వ ఏట 8848 మీటర్ల ఎత్తుగల ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన యువకెరటమన్నారు. దీంతో పాటు 8516 మీటర్ల ఎత్తైన పర్వతాలెక్కి ఆయన సత్తా చాటారన్నారు. నంతరం పర్వతారోహకులు సురేష్‌బాబు, శ్రీలత, రేపల్లె సుందరరాజు, గానుగపెంట హరిప్రసాద్‌లు పర్వతారోహణలో ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు.వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడారు. కార్యక్రమంలో వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానుమద్ది విజయభాస్కర్, గానుగపెంట హనుమంతరావు, మొగిలిచెండు సురేష్, భూపతిరాయల్, కొత్తపల్లి రామాంజనేయులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ, ట్రాక్టర్ ఢీ : ఒకరి మృతి



జాతీయ రహదారిపై బోల్తా పడిన ట్రాక్టర్



జేష్టాది రాజేంద్ర మృతదేహం

దువ్వూరు : మండల పరిధిలోని మీర్జాఖాన్‌పల్లె వద్ద కడప- కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ – ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి ఎరువుల బస్తాల లోడుతో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు వెళుతున్న ట్రాక్టర్‌ను కోలార్ నుంచి నంద్యాలకు క్యాబేజి లోడుతో వెళుతున్న లారీ వేగంగా వెనుక నుంచి ఢీకొంది. దీంతో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న జేష్టాది రాజేంద్ర (43) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్, హరి గాయపడ్డారు. దువ్వూరుకు చెందిన జేష్టాది రాజేంద్ర వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదే గ్రామానికి ప్రసాద్, హరి, జేష్టాది రాజేంద్రలు ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలను లోడ్ చేసేందుకు వెళ్లారు. నెల్లూరులో ట్రాక్టర్‌కు ఎరువుల బస్తాలను లోడ్ చేసుకుని ఆళ్లగడ్డకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. రాజేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మూర్తి తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



ప్రొద్దుటూరు: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం : రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా విధులు నిర్వహించేలా పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని పోలీస్‌స్టేషన్‌లను బుధవారం ఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్‌లోని నేరాల స్థితిగతుల గురించి సీఐ ఇబ్రహీంను అడిగి తెలుసుకున్నారు. నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. తర్వాత త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు.వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం చేశారు. కేసుల పురోగతి గురించి సీఐ రాజారెడ్డి ఎస్పీకి వివరించారు. చివరగా రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. పలు కేసుల పూర్వాపరాల గురించి సీఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవిలతో ఎస్పీ మాట్లాడారు. నేరాలు అదుపు చేయడంతో పాటు కేసులను త్వరగా పరిష్కారయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రొద్దుటూరుపై ప్రత్యేకంగా ఫోకస్ పెడతాం

ప్రొద్దుటూరుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లను సందర్శించి పోలీసు అధికారుల పనితీరుపై రివ్యూ చేస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో ప్రొద్దుటూరులోని ఎస్‌డీపీఓ ఆఫీసుతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్, పోలీస్‌స్టేషన్లను సందర్శించానన్నారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లోని పోలీసు అధికారుల పనితీరు బాగుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్య, మహిళలకు సంబంధించిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. చోరీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఉన్నారు.

రాజుపాళెం : రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణం పరిశుభ్రత, రికార్డులను ఎస్పీ పరిశీలించారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ

చాపాడు : స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరు, విధుల నిర్వహణ వంటి వాటిపై ఆరాదీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీసు సేవలను అందించాలన్నారు. దిశ యాప్‌ను మహిళలు వినియోగించుకునేలా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : దువ్వూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. మైదుకూరు రూరల్‌సీఐ శ్రీనాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సిద్ధార్థ కౌశల్‌ను యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అవసరమైన మేర రక్షణ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

దొంగల అరెస్టు

– సిబ్బందికి ఎస్పీ అభినందనలు

కడప అర్బన్ : జిల్లాలోని జమ్మలమడుగు అర్బన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో సీఐ సదాశివయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అభినందించారు. బుధవారం వారిని కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి పిలిపించి ప్రశంసాపత్రాలు అందజేశారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి దాదాపు రూ. 5లక్షల విలువైన ట్రాక్టర్, ట్రాలీని రికవరీ చేయడంలో హెడ్‌కానిస్టేబుల్ కె. దేవదాసు(హెచ్‌సి 1987), సిబ్బంది కానిస్టేబుల్‌లు ఎస్.డి రియాజ్ అహ్మద్ (పిసి 2906), వై. ఈశ్వరయ్య (పిసి 2916) ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముున్ముందు ఇదే స్ఫూర్తితో విధులను నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



కేక్ కట్ చేస్తున్న ఎస్ఆర్ఐటీ కాలేజీ నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలకు 2023–24 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ హోదా లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. బుధవారం అటానమస్ హోదా వచ్చిన సందర్భంగా కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలను ఏర్పాటు చేసి పది సంవత్సరాలు కావడం, యూజీసీ 2(ఎఫ్) గుర్తింపు, నాక్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్, నాణ్యమైన విద్య అందిస్తుండటంతో స్వయం ప్రతిపత్తి గుర్తింపు వచ్చిందన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్ హోదా లభించడం సంతోషదాయకమన్నారు.